# క్రిస్మస్ ప్రేమ

లంకపల్లి సంపత్ కుమార్



అదో కాన్వెంట్ స్కూల్. క్రిస్మ్‌నకు ముందు ఓరోజు...

"క్రిస్మస్‌కు 'యేసు జననం' నాటిక వేయడానికి ఈసారి మన క్లాసుకు అవకాశం వచ్చింది. మిగతా క్లాసు పిల్లలు పాటలు, డాన్సులలో పాల్గొంటారు. మనం బాగా చేయాలి" అంది పూజా టీచర్ పిల్లల్ని అందర్నీ గమనిస్తూ.

"ఓ... భలే... భలే.." అన్నారు పిల్లలందరూ సంతోషంగా.

"ఎవరెవరు ఏఏ పాత్రలు వేయాలనుకుంటున్నారో మీ పేర్లు యివ్వండి. సరిపోయే వారిని తప్పక ఎన్నుకుంటాం..." అంది టీచర్.

"ఏం... ఆశ మౌనంగా వున్నావ్. నీకు ఇంట్రస్ట్ లేదా?" అంది పూజా టీచర్ ఆ అమ్మాయినే గమనిస్తూ.

"నాకు చాలా సంతోషంగా వుంది టీచర్. ముందు యేసు జనన వృత్తాంతం మన వాళ్ళందరికీ తెలియాలిగా టీచర్" అంది ఆశ.

ఆశను పరిశీలనగా చూసింది పూజా టీచర్. ఆ అమ్మాయికి ఎనిమిదేళ్ళే అయినా ఎంతో వయస్సుకు మించి తెలివైనది. ఆమె ఆలోచనలు చాలా లోతుగా వుంటాయి. అందుకే టీచర్లందరికీ ఆశ అంటే యిష్టం. ఆ క్లాసు టీచర్‌గా పూజకు మరీనూ.

"ఎందుకు తెలియదు. ప్రతి సంవత్సరం క్రిస్మస్ నాటికను ప్రదర్శిస్తున్నాం. పిల్లలందరికీ తెలుసుగా" అంది పూజా టీచర్.

"అవును, మాకు తెలుసు" అన్నారు కొందరు.

మిగతా పిల్లలు ముఖముఖాలు చూసుకున్నారు – ఎక్కడ టీచర్ ప్రశ్నలు వేస్తుందోనని!

"సరే... మిమ్మల్ని ప్రశ్నలు వేస్తాము. తెలిసినవి తెల్పండి. గ్రేస్ – ముందు నీవు చెప్పమ్మా..." అని గ్రేస్ అనే అమ్మాయి వైపు చూసింది. ఆ అమ్మాయి లేచి నిలబడింది.

"యేసుక్రీస్తు ఎక్కడ జన్మించాడు?"

అయోమయంగా చూసింది గ్రేస్. 'ఎవరికైనా తెలుసా?' అడిగింది పూజా టీచర్.

కొంతమంది చేతులు పైకి లేపారు. వారినడిగితే – కొందరు యెరూషలేము అనో... నజరేలు అనో చెప్పారు. ఆశ లేచి నిల్చుని "యేసు పుట్టింది బెత్లెహేము అనే చిన్న గ్రామంలో. అది యెరూషలేముకు ఐదు మైళ్ళ దూరంలో వుంది" అంది.

"భేష్! బాగా చెప్పావు" అని మరికొన్ని ప్రశ్నలు వేసింది టీచర్.

యేసుకు భూలోకంలో తల్లిదండ్రులెవరు?

ఈసారి ఆశానే చెప్పింది – "యేసు తల్లి కన్యమేరీ, తండ్రి యోసేపు"

"యేసు మాటకు అర్థం?"

"యేసు అనగా – తన ప్రజలను వారి పాపముల నుంచి రక్షించే రక్షకుడు అని అర్థం. దీనినే మెస్సియా అంటారు".

"యేసు ఎందుకు జన్మించాడు?"

"ఆ రోజులలో ప్రజలలో పాపం పెరిగిపోయింది. దేవునికి మానవుల మధ్య పాపం వారిని వేరుచేసింది. ఆ పాప పరిహారార్థం ఓ నీతిమంతుడు, పాపం లేనివాడు, పరిశుద్ధుడు. తన ప్రాణం పెట్టాలి. ఇది సామాన్య మానవుల వల్ల అసం

భవం. అందుకే... దేవుడే తన కుమారుడు యేసును మానవుల పాప ప్రక్షాళనకు భూమిపైకి పంపాడు. యేసు ఉదయించిన రోజు పండుగే క్రిస్మస్!''

పిల్లలందరూ ఆశ సమాధానానికి చప్పట్లు కొట్టారు. చాలా విషయాలు నేర్చుకున్నావ్. పెద్ద లకు కూడా తెలియని విషయాలు నీకు ఎలా తెలుసు ఆశా?'' అడిగింది పూజా టీచర్.

''కొంత చర్చిలో, మరికొంత మా మమ్మీ, డాడీలు చెపితే నేర్చుకున్నాను. ఇంకా కొన్ని విష యాలు బైబిల్ చదివితే తెలిశాయి'' అంది ఆశ.

''వెరీగుడ్. నీవు ఈ వయస్సులోనే బైబిల్ చద వడం చాలా సంతోషం. ఏదీ, క్లుప్తంగా యేసు జననం గురించి చెప్పు'' అంది టీచర్ మళ్ళీ.

కాసేపు ఆలోచించి, ప్రారంభించింది ఆశ!

''పాప పీడితులైన మానవులు తమను తాము రక్షించుకోలేని స్థితి. యజమానులు బానిసలను భయంకరంగా బాధించే రోజులు. రోగాలు, నిరాద రణ. ప్రజలు దుఃఖంలో 'దేవుని కుమారుడు వస్తాడు. మమ్ములను మా పాపాలనుంచి విడిపి స్తాడు' అని విశ్వసిస్తున్న రోజులలో వారిని రక్షించేం దుకే యేసు జన్మించాడు. టీచర్ మీరు చెప్పండి - బాగుంటుంది'' అంది ఆశ.

పూజ టీచర్ 'యేసు జననం' వివరించసాగింది.

''నజరేతు అనే గ్రామంలో దైవభక్తిగల కన్య మరియ వుంది. ఆమె వివాహం యోసేపు అనే యువకునితో నిర్ణయించబడింది. ఒకరోజు దేవుని దూత మరియ వద్దకు వచ్చి, 'నీవు కుమారుని కంటావు. అతనికి యేసు అని పేరు పెడతావు' అని చెప్తాడు.

'అయ్యో, నేను వివాహం కానిదానను' అని మరియ అంటే, ఇది దేవుని సంకల్పం అని దూత తెల్పడంతో 'నేను దేవుని దాసురాలను, అలాగే' అంది.

మరియ గర్భం దాల్చిన విషయం తెల్సుకున్న యోసేపు ఎంతో వేదన చెంది, ఆమెను రహస్యంగా విడిచివేయాలనుకున్నాడు. అతనికి స్వప్నంలో గాబ్రియేలు దూత కన్పించి, 'ఇది దేవుని ప్రణాళిక! నీవు మరియను నీ భార్యగా స్వీకరించు' అన్నాడు. యోసేపు అలాగే మరియను భార్యగా స్వీకరిం చాడు.''

అందర్నీ కలయజూసింది టీచర్. పిల్లలంతా వినడం చూసి, తిరిగి ప్రారంభించింది.

ఆరోజుల్లో ప్రపంచ జనసంఖ్య రాయాలని, ప్రజలు తమ స్వగ్రామాలకు వెళ్ళాలని ఆజ్ఞ వెలువ డింది. దావీదు గోత్రములో పుట్టిన యోసేపు జన సంఖ్యలో తన పేరు, తన భార్య మరియ పేరు రాయించుకోవడానికి బెత్లెహేము అనే ఊరికి బయ లుదేరాడు. అప్పటికే మరియ నిండుచూలాలు. ఆమెను ఓ గాడిద పిల్లపై కూర్చోబెట్టుకుని, బెత్లె హేము వెళ్ళేసరికి, సత్రాలన్నీ జనంతోనిండిపో యాయి. మరియ నిండుచూలాలు అని జాలిపడి, పశువుల కొట్టంలో స్థలం ఇచ్చాడు సత్రం యజ మాని.

ఆ పశువుల కొట్టంలోనే మరియ, యేసుకు జన్మ నిచ్చింది. ఈ వార్త పొలాల్లో పశువులు కాచుకుం టున్న గొల్లలకు దూతలు తెలిపితే, వారు గబగబా పరుగెత్తుకొచ్చి, ఆ బాలయేసును పూజించారు.

యేసు జన్మకు ముందు ఆకాశంలో అద్భుత మైన, ప్రకాశవంతమైన ఓ నక్షత్రం ఆకాశంలో వెలి సింది. ఇది ఓ మహనీయుని జన్మని తెలుపుతుం దని తెలుసుకున్న కొందరు తూర్పుదేశపు జ్ఞానులు, ఆ రాజుకు మ్రొక్కాలని బంగారం, సాంబ్రాణి, బోళములను తీసుకుని బయలుదేరారు.

రాజు పుట్టాడు కాబట్టి, రాజు రాజగృహంలో పుడతాడని జ్ఞానులు యెరూషలేములో వున్న రాజైన హేరోదు దగ్గరకు వెళ్ళి 'యూదుల రాజు' ఎక్కడ జన్మించాడు? అని అడిగారు. హేరోదు రాజు కలవరపడి, తన దగ్గరున్న జ్ఞానులను అడి గితే, వారు గ్రంథాలు చదివి, తప్పకుండా యూదుల రాజు బెత్లెహేములో జన్మిస్తాడని తెలి పారు. ఈ విషయం తెలుసుకున్న తూర్పుదేశపు జ్ఞానులు - నక్షత్రం దారి చూపుతుంటే, దాని వెంబ డించి, యేసు వున్న స్థలంలో అది ఆగిపోవడంతో అక్కడున్న యేసును పూజించి, కానుకలు సమర్పిం చుకున్నారు. ఇదర్రా .. క్రిస్మస్'' అంది పూజా టీచర్. మాకు బాగా అర్థం అయింది టీచర్ అన్నారు పిల్లలంతా.

''టీచర్, అందరూ క్రిస్మస్ వరకే చెప్తారు కాని, యేసు బోధనలు ఎందుకు ప్రజలకు తెలుపరు?'' అంది ఆశ.

ఆశ్చర్యపోయింది, పూజా టీచర్. ఏమిటా బోధనలు... నీకు తెలుసా?'' అంది.

'ఓ...' అంది ఆశ.

''యేసు చెప్పిన బోధ లలో ముఖ్యమైనది - 'నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించు' అనేది. ఆది ఆజ్ఞ. మరొ కటి - 'నీకు విరుద్ధంగా పాపం చేసిన వారిని క్షమించుట'. మరో ముఖ్యమైనది - దేవుణ్ణి ప్రేమించి, ఆయనను విశ్వసించి, పరిశుద్ధంగా జీవించుట.

'భేష్' చప్పట్లు కొట్టి, ఆశను దగ్గరకు తీసుకుని కౌగిలించుకుని, ఆమె చెక్కిలిని ముద్దాడింది పూజా టీచర్.

''ఈ బోధనలలో ఒక్కటైనా నీవు అనుసరి స్తున్నావా?'' అడిగింది పూజా టీచర్.

''నేను చిన్నదానిని కదా టీచర్. అయినా ప్రయత్నిస్తున్నాను'' అంది ఆశ.

'వెల్... అలాగే సాగిపో' అంది పూజా టీచర్ - ఆ అమ్మాయి తెలివికి ఆశ్చర్యపోతూ.

***

ఆశకు పెరుగన్నం అంటే ఇష్టం ఉండదు. మమ్మీ, అమ్మమ్మలు ప్రతిరోజూ భోజనం దగ్గర గొడవ. పెరుగు తింటే చలవ చేస్తుందని వారి వాదన. 'పోనీలే.. దానికి ఇష్టం లేకపోతే వదిలే యండి' అంటే ఆమె డాడీ మాట వినలేదు.

ఆరోజు కూడా ఇదే తంతు జరుగుతున్నది. మమ్మీ ఎంతగానో బ్రతిమాలుతోంది.

''సరే మమ్మీ, నీవు అంతగా అడుగుతున్నావు కాబట్టి తింటాను. ఈ ప్లేటులోని పెరుగన్నం అంతా తింటాను... కానీ..'' ఆగిపోయింది ఆశ.

''ఎందుకు ఆగిపోయావ్. చెప్పు, ఏం కావాలి?'' అడిగింది మమ్మీ.

''నాకు డాడీ ఓ మాట ఇవ్వాలి'' అంది ఆశ.


''సరే, నీవు ఏదడిగినా ఇస్తాను'' అన్నారు డాడీ.


''డాడీ ఏదైనా యిస్తానన్నారని, ఏ కంప్యూటరో మరేదో అడగవద్దు. ఆయన దగ్గరున్న డబ్బులను గుర్తించి, అడుగు'' అంది మమ్మీ.

''డాడీకి అంత ఖర్చు అవదులే'' అంది ఆశ.

''సరే ... నీ యిష్టం. నీ కోరిక తీరుస్తాను'' అన్నారు డాడీ.

మందు తిన్నట్టు ఒకో పెరుగు ముద్ద మమ్మీ తినిపిస్తుంటే, తిన్నది ఆశ.






ఏమి అడుగుతుందోనని ఎదురుచూడసాగారు ఆశవైపు చూస్తూ మమ్మీ, డాడీలు.

''డాడీ... నాకు బోడిగుండు చేయించుకోవాలని వుంది. నాకు బోడిగుండు కావాలి'' అంది ఆశ.

మమ్మీ 'గయ్'మంటూ లేచింది. ''నీకు గుండు కావాలా? ఏమైనా పిచ్చిపట్టిందా. ఇంత చక్కటి జుట్టు కత్తిరించుకుంటావా?'' కసిరింది మమ్మీ.

''అదుగో. మీరు మాట తప్పుతున్నారు. నేనడిగింది యిస్తానన్నారు'' అంది ఆశ దుఃఖంతో.

''ఇదేం రోగమండీ. ఏవైనా కొత్తబట్టలు, పుస్తకాలు అడుగుతారు గానీ, ఇదేంటీ, బోడిగుండు కావాలంటున్నది'' అన్నది ఆశ వాళ్ళ మమ్మీ.

డాడీ కాసేపు ఆలోచించి ''ఏం చేస్తాం, ఒప్పుకున్నాం. దాని ఇష్టప్రకారం కానీ. మరోసారి నచ్చ చెప్పి చూడు'' అంటూ ''ఆశా, బోడిగుండులో నీవు బాగోవు. నీ స్కూల్ పిల్లలందరూ నిన్ను హేళన చేస్తారు. చాలా అవమానకరంగా వుంటుంది. ఆలోచించుకో... ఇక తప్పదు అంటే, నీ యిష్టం'' అని ఆశను ముద్దుపెట్టుకుని వెళ్ళిపోయారు డాడీ.

***

పిల్లలంతా హేళన చేస్తారు. అమ్మాయిలు ఎక్కడైనా బోడిగుండు గీయించుకుంటారా? ఎంత చెప్పినా వినలేదు. చివరకు తప్పలేదు. ఆశను స్కూటర్‌పైన కాన్వెంట్‌కు తీసుకువచ్చి దింపారు డాడీ. మమ్మీ కూడా వచ్చింది. స్కూల్ బ్యాగ్ తగిలించుకుని, గేటులోనికి వెళ్లింది ఆశ, తల్లిదండ్రులకు టాటా చెపుతూ. ముందుగా ఆమెను మిగతా పిల్లలు పట్టించుకోలేదు. గుర్తుపట్టినవారు హేళనగా నవ్వసాగారు. కొందరు చప్పట్లు కొట్టసాగారు. ఆమె బోడిగుండును తడుముతూ ఏదో అంటున్నారు.

ఇదంతా గమనిస్తున్న ఆశ తల్లికి దుఃఖం వచ్చింది. ఈ పిల్ల ఎందుకు యిలా చేసింది? అని బాధపడుతుండగానే అక్కడికి చేరుకున్న పూజా టీచర్‌కు జరిగింది చెప్పి, బోడిగుండుతో ఉన్న ఆశను ఆట పట్టిస్తున్న పిల్లలను చూపింది.

వారు చూస్తుండగానే, ఓ కారు వచ్చి ఆగింది. అందులో ఓ చిన్ని అబ్బాయి బోడిగుండుతో దిగాడు. వాడ్ని చూస్తూనే ఆశ వాడి దగ్గరకు పరుగెత్తి, చేతిలో చేయివేసి, వాడ్ని స్కూలులోకి తీసుకువెళ్ళసాగింది. ఆ పిల్లవాడి తల్లి కారుదిగి, ఆశ వాళ్ళ తల్లిదండ్రుల దగ్గరకు వచ్చింది. పూజా టీచర్‌కు వందనాలు తెలిపింది.

''ఈ చిన్ని అమ్మాయి ఆశకు జన్మనిచ్చినందుకు మీరు గర్వించాలి'' అంది ఆశ తలిదండ్రులతో.

వారేమీ మాట్లాడలేదు. ''ఎందుకు అనరేం? షి ఈజ్ గ్రేట్... ఆంటీ.. యేసు ఏమి బోధించాడో తెలుసా? నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించు..'' అంది.

పూజకు కొంచెం అర్థం అవ్వసాగింది. ఆ కుర్రాడి తల్లి మళ్ళీ చెప్పింది. ''మా అమ్మాయి కూడా యిక్కడే చదువుతోంది. ఆశ క్లాస్‌మేట్ గ్రేస్. ఆ బోడిగుండు కుర్రాడు నా కొడుకే. వాడికి కాన్సర్. ట్రీట్‌మెంట్ జరుగుతున్నది. రేడియేషన్ వల్ల వాడి జుట్టంతా రాలిపోయి బోడిగుండయ్యింది. స్కూలుకు వెళ్ళమంటే, బోడిగుండుతో వెళ్ళనని ఒకటే గోల. గత మూడు నెలల్నుంచి యింట్లోనే వుంటున్నాడు. గ్రేస్‌ను కలిసేందుకు మొన్న మా యింటికి వచ్చింది ఆశ. విషయం తెలుసుకుని – మావాడ్ని ఎంతగానో బతిమాలుకుంది. 'నీ బోడిగుండు సిగ్గయితే, నేనూ బోడిగుండు చేయించుకుంటాను. అప్పుడు నిన్ను అంతగా హేళన చేయరు' అంది. అన్నట్టుగానే తనూ బోడిగుండు చేయించుకుని, నా కొడుకుని క్లాసుకు తీసుకెళ్ళింది'' అంది ఆమె కన్నీరు పెడుతూ.

ఆశ వాళ్ళ మమ్మీడాడీల కళ్ళు చెమర్చాయి. మాటలు రాక, కన్నీళ్ళు తుడుచుకుంది పూజా టీచర్.

''యేసు జననం నాటకంలో ఆయన బోధలు మనం ప్రకటించాలి టీచర్. ఆయన నీ పొరుగువాడిని నీ వలెనే ప్రేమించమన్నాడు టీచర్'' – ఈ మాటలు వారితో పంచుకుని, ఆ చిన్నపిల్ల ఆదర్శం చూసి ఆశ్చర్యపోయారు వారంతా.

***

మరునాడు –

నాటకం ప్రదర్శించబడుతోంది. పిల్లలు, వారి తల్లిదండ్రులు నాటకం చూస్తున్నారు. పెద్ద క్రిస్మస్ ట్రీని స్టేజి పక్కగా అలంకరించారు. క్రిస్మస్ తాత వేషంలో మరొకరు పిల్లల్ని పలకరించి, బహుమతులు పంచుతున్నారు.

క్రిస్మస్ అంటే ప్రేమ! దేవుని ప్రేమ. అందుకే ఆయన తన కుమారుణ్ణి లోకంలోకి పంపారు. మనం కూడా మన పొరుగు వారిని ప్రేమిద్దాం. ఈ క్రిస్మస్‌లో మన పొరుగువారిని ఆదరిద్దాం. అందుకు నిదర్శనం – ఆశ అనే మా క్లాసు అమ్మాయి...'' చప్పట్లతో ఆవరణ అంతా మారుమ్రోగింది – సంతోషంతో. ఆశను చూసి అందరూ అభినందించారు.

★